# పదచ్యుతులు

**"రమేష్"**

శివపురం జమీందారీ పోయేటప్పటికి యేం మిగిలినా మిగలక పోయినా యెస్టేటు పేరు చెప్పుకొంటూ నేనూ మా చెల్లీ మాత్రం మిగిలాం.

అసలు మాసంగతి మాకే తెలియదు. కాని మా పినతల్లి చెప్పిన దాన్ని బట్టి చూస్తే మా అమ్మని మా అమ్మమ్మని ప్రస్తుతం యెస్టేటు అధికారం కోలుపోయిన మధుసూధన రావుగారు తీసికొని వచ్చినట్టు తెలుస్తోంది. నాకు బాగా జ్ఞప్తిలేదు గాని, మా చెల్లి పుట్టిన కొద్ది రోజులకే మా అమ్మ చనిపోయిందనీ, అప్పటినుండీ మా పినతల్లే మమ్మల్ని సాకుతూ వచ్చిందని స్పష్టమౌతోంది.

కొద్ది రోజులక్రితం ఎస్టేటు పోతున్న చివరి రోజులలో ఎవరో మధుసూధనరావుగారి స్నేహితులు వచ్చి చాలా బలవంతం మీద వారి ప్రాపకంతో బ్రదుకుతున్న మా పిన తల్లిని వేరుచేసి తమ ప్రాపకంలోకి తీసికొన్నారు.

పినతల్లి వెళ్ళిపోయాక నేనూ మా చెల్లీ నిజంగా తల్లి లేని పిల్లలై పోయాము. చిన్న వాళ్ళమైన మా మీద మధుసూధనరావుగారికున్న అభిమానం ఎంత ఆత్మబంధువులకైనా వుండదంటే అతిశయోక్తికాదు.

వారు భోంచేస్తున్నా, కచేరి చావిడిలో వున్నా, పడక గదిలో వున్నా మే మాతనితో వుండవలసిందే. ఎవ్వరూ మమ్మల్ని ఏమీ అనటానికి హక్కులేదు. మా కేది కావలసినా, ఎక్కడికి వెళ్ళాలన్నా ఏ ఆటంకమూ వుండేదికాదు. ముఖ్యంగా నా కన్నా మా చెల్లెలంటే మధుసూధనరావు గారికి వున్న అభిమానం, ప్రేమ చెప్పశఖ్యంకాదు. మా చెల్లి రోజు రోజుకూ పెద్దదౌతూంటే చూడ ముచ్చట వేసేది.

ఎస్టేటులో పెద్ద ఉద్యోగుల దగ్గరనుంచి కంబారీవాని వరకూ మమ్మల్ని పలుకరించి గౌరవించని వాళ్ళంటూ లేరు. అయితే యీ గౌరవం నాకంటే మా చెల్లెలే ఎక్కువ పొందేది. ఏమైనా మా చెల్లెల్లో వున్న సున్ని తత్వమూ, ఆకర్షణా నాకెక్కడ వస్తాయి? ఎస్టేటు డాక్టరు మాకేమీ జబ్బులు రాకుండా జాగ్రత్త తీసుకోవలసిందే. చెబితే నమ్మండి చీకూ చింతా లేని జీవితాలై పోయాయి మావి. ఒక్కొక్కప్పుడు యేం చెయ్యటానికి తోచక సుఖ జీవితమంటేనే విసుగెత్తిన రోజులున్నాయి.

మా స్నాన భోజన సదుపాయాలకు లోటుంటుందని ఎవరనుకోగలరు? మేము మధుసూధనరావుగారి పంక్తిని భోజనం చెయ్యాల్సిందే. ఒకనాడు మా చెల్లి భోజన సమయానికి రాకుండా అలిగి పడుకుంది. నేను మాత్రం బుద్ధిమంతుడిలా వచ్చి కూర్చున్నాను. మధుసూధనరావు గారు స్వయంగాపోయి మా చెల్లెలిని బుజ్జగించి తీసుకు వస్తూంటే నాకు ఆశ్చర్యమేకాదు, అభిమానం కూడ వేసింది. దాని అదృష్ట రేఖకు ఆరోజు అంతేలేదు.

సాయంత్ర మయ్యేసరికి ఆస్థిలో సగం ఖరీదు చేసే కారులో, సున్నగా, మెత్తగా ముఖమల్ దిండ్ల మీద షికారు పోయే వాళ్ళం బీచికి.

ఆహా! ఆ రోజులు తలచుకొంటేనే గుండె నీరయి పోతుంది.

ఇక యిప్పటి పరిస్థితి అంటారా! వినండి. ఎస్టేటు పోయాక మధుసూధనరావుగారు ఎస్టేటు ఆర్జులను తిట్టుకుంటూ జబ్బుపడి మద్రాసు హాస్పటలుకు వెళ్ళిపోయారు. క్రమంగా సంపత్తి క్షీణించి పోయింది. యీ గొడవలో మేం అడుగున పడిపోయాం. క్రమంగా ఒక్కొక్కరే మమ్మల్ని విస్మరించారు. చివరకు గజ్జి, చిడుము పట్టుకొని రోగంతో కృసించిపోయే స్థితి వచ్చింది. ఒంటినిండా కురుపులు లేచాయి. ఆ దిక్కులేని స్థితిలో మా చెల్లెలే నాకు పరిచర్య చేసేది. చివరకు అనుకున్నంత పనీ అయింది. మా చెల్లెలికి జబ్బుచేసి చచ్చిపోయే స్థితికి వచ్చింది. ఒంటినిండా కురుపులు లేచాయి. బలమైన ఆహారం లేక యెముకలు బయటపడినై. చివరకు విసుగు, అసహ్యాము పుట్టి ఎస్టేటు లోగిలిలోనుండి ఆవరణలోనికి, ఆవరణలోనుండి వీధిలోనికి గెంటి వేశారు. ఇప్పుడు మే మటువేపు తిరిగితే మా వీపు బ్రద్దలౌతుంది.

మాలాగే దిక్కులేక దీనదశలో వీధుల్లో తిరిగే స్నేహితులు మమ్మల్ని కసిరేవారు. ఇదిగో చూశారా! మీతో యీగొడవ చెప్పుతూ కూర్చుంటే అసలికి మోసం

## పదచ్యుతులు

వస్తుంది. కడుపు లోపలికి పోయింది. చెడ్డ ఆకలేస్తోంది, అన్నట్టు చెప్పటం మరచాను— ఓట్ల ప్రచారార్థం మావూరు వేంచేసిన ఓ ప్రముఖ నాయకుడు కారులో జోరుగాపోతూ మాంసరపోతమై ఠక్కచిక్కిన మా చెల్లెలిని మట్టించుకొని పోయాడు. నాలో నేను ఏడవటం తప్ప ఇంకేమీ చేయలేక పోయాను.

సరే! ఏం చేస్తాం? అదిగో నాతోటి వారంతా అటు పరిగెత్తుతున్నారు. ఏ ఇల్లాలైనా పుల్లాకులు డబ్బాలో వేసి వుంటుంది. నేనూ పోతున్నాను.

ఒక్కమాట! మేం ఒకప్పుడు శ్రేష్టమైన వేటకుక్కల జాతికి చెందిన వాళ్ళం. యీనాడు ఊరి కుక్కలకన్నా అర్థాన్నం అయిపోయాం!

నా పేరు టామ్ — మా చెల్లి పేరు లిల్లీ — యిక శలవ్.

---

## ఆంధ్రమహిళా సమితి

### జంషెడ్పురం.

ఆంధ్ర మహిళా సమితివారు మార్చి 16 వ తారీఖున మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములుగారి జన్మదినోత్సవము జరిపిరి. శ్రీ పొట్టి శ్రీరాములుగారి పటమునకు పూల-మాలలువేసి పూజించి, ఆయన చేసిన త్యాగములను గురించి సమితి అధ్యక్షురాలు శ్రీమతి. శ్యామలామూర్తి మాట్లాడినారు. ఆ దినమే సమితి యొక్క కొత్త కార్య నిర్వాహకవర్గము ఎన్నుకోవడము జరిగినది. సమితి కార్యదర్శిని శ్రీమతి కృష్ణవేణీరావు 1953. వ. సం॥ రిపోర్టు చదివిరి. తదుపరి ఎన్నికలు ప్రారంభించిరి. ఎన్నుకొనబడిన కార్యనిర్వాహక వర్గము.

అధ్యక్షురాలు శ్రీమతి. శ్యామలామూర్తి. ఉపాధ్యక్షురాలు శ్రీమతి. సుభద్రామూర్తి. కార్యదర్శిని శ్రీమతి. కృష్ణవేణీరావు. సహాయకార్యదర్శిని శ్రీమతి. డి. నాగుబాయి. కోశాధికారిణి కుమారి కె. సావిత్రి. తరువాత కమిటీ మెంబర్ల ఎన్నికలు అయినవి. కొత్త కార్య నిర్వాహక వర్గము వారు అల్పాహార విందు జరిపిరి. ఆఖరున కార్యదర్శిని అభివందనలతో ఆనాటి సభ ముగిసినది.

శ్రీమతి కృష్ణవేణీరావు.
కార్యదర్శిని.


# మొగలి పొట్లము

ఆకర్షణీయమైన వ్యాససంపుటి.

రచన: శ్రీమతి. కె. లక్ష్మీరఘురామ్

క్రౌనుసైజు — 100 పేజీలు.

వెల — రూ 1-0-0

ఆంధ్రమహిళా ముద్రణాలయములో ముద్రింపబడుచున్నది.

వలయువారు:

ఆంధ్ర మహిళాప్రెస్సు, మదరాసు-4.

అని వ్రాయవలెను.

మీరందరు తప్పకుండా
చదివి తీరాల్సిన పుస్తకం!

# జాజిమల్లి

(ఆంధ్ర మహిళలో సీరియల్‌గా ప్రచురింపబడిన నవలానిక)

గ్రంథకర్త:

కీ. శే. కులపతి అడివి బాపిరాజుగారు

150 పేజీలు :: వెల 1-8-0

ప్రతులు దొరుకుస్థలము:

హిగ్గిన్‌బాదమ్స్ అన్ని బుక్‌స్టాల్సు,
వెంకట్రామా అండ్ కో.,
ఆంధ్ర మహిళా ప్రెస్, మద్రాసు-4.